




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 14

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 18 మే 2025


## స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● అక్టోబర్ 2 నాటికి చెత్త లేని పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ● స్వచ్ఛ ఆంధ్ర తోనే నిజమైన స్వర్ణ ఆంధ్ర సాధ్యం ● సీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం ● హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారుచేస్తాం ● రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని అంతం చేశాం... భవిష్యత్తులోనూ ఫ్యాక్షన్ తలెత్తనివ్వం ● ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం -ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ● కర్నూలు జిల్లా, పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ● సీ.క్యాంపు రైతుబజార్ సందర్శన అనంతరం రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాటామంతీ ● పాణ్యం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు విడుదల ● రూ. 50 లక్షలతో ఉద్యానవన అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన















**పాణ్యం,కలంకౌంటర్ :** స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. తెలుగుదేశం హయాంలో రాయలసీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకలించివేశామని, భవిష్యత్తులోనూ సీమ గడ్డపై ఫ్యాక్షన్ మాట వినబడనివ్వమని స్పష్టం చేశారు. సీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారుచేస్తామని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు సీ క్యాంప్ రైతుబజార్ ను పరిశీలించి అక్కడ రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు.

**స్వచ్ఛాంధ్ర సాధనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి..** నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసుకోవాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహించాలి. దుమ్ము దులిపి స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. ఆధునిక ప్రపంచంలో చాలామంది అనారోగ్యం

- 2లో







## ఏపీలోని విద్యుత్ సంస్థల్లో సమ్మెలు నిషేధిస్తూ ఉత్తర్వులు

- 6 నెలలు పాటు ఎటువంటి సమ్మెలు చేయటానికి వీలు లేదు



**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీ లోని విద్యుత్ సంస్థల్లో సమ్మెలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలలో 6 నెలల పాటు ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ఏపీ అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) 1971 ప్రకారం ఈ నెల 10వ తేదీ నుంచే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు.

## పోలవరం ప్రాజెక్ట్ పై ఈ నెల 28న సీఎంలతో ప్రధాని సమావేశం






**అమరావతి,కలంకౌంటర్ :** ఏపీలోని పోలవరం ప్రాజెక్టుకు మంచి రోజులు వచ్చాయి. ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి పై ప్రధాని మోదీ తొలిసారి సమీక్ష జరుపనున్నారు. ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఆంధ్ర, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్రెడ్డితో పాటు ఒడిశా, ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రులు మోహన్ చరణ్ మాజీ, విష్ణుదేవ్ సాయి, ఆయా రాష్ట్రాల జల వనరుల మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించనున్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి

**అన్నవరం,కలంకౌంటర్ :** కాకినాడ జిల్లా తుని వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులంతా రాజమహేంద్రవరం అపోలో ఫార్మసీ ఉద్యోగులు. మృతులను రాజ మహేంద్రవరానికి చెందిన గెడ్డం రామరాజు, హాజరత్ వాలీ, తణుకుకు చెందిన వరాడ సుధీర్గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ గోనా శివశంకర్, వెంకట సుబ్బారావును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సమావేశానికి హాజరై కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీ విశాఖపట్నం నుంచి మండపేటకు ఐరన్ లోడ్తో వెళ్తోంది.

**రోడ్డు ప్రమాదంపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి..** ఈ ప్రమాదంలో ముగ్గురి మృతి పట్ల మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## గడువులోగా గృహనిర్మాణాలను పూర్తి చేయాలి

● రాష్ట్ర గృహనిర్మాణం,సమాచార పౌర సంభందాల శాఖ మంత్రి కోలుసు పార్ధ సారధి ఆదేశం






**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న గృహాలను వెంటనే పూర్తీ చేయాలని,కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్దేశించిన 3 లక్షల గ్రుహాలనిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర గృహనిర్మాణం,సమాచార పౌర సంభందాల శాఖ మంత్రి కోలుసు.పార్ధసారధి అధికారులను ఆదేసించేరు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకేసారి 3 లక్షల మందికి గృహనిర్మాణాలు పూర్తీ చేసి లబ్దిదారులకు ఇంటి తాళాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదేసించేరని ఆయన అన్నారు.రాష్ట్రంలో అమలు జరుగుతున్నా గృహనిర్మాణాల పనితీరు పై మంత్రి శనివారం విజయవాడలోని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించేరు,ఈ సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల గృహనిర్మాణ సంస్థ అధికారులు,ఫీల్డ్ అధికారులు పాల్గొన్నారు.జిల్లా అధికారులు అందరూ నిత్యం లే ఔట్లలో ఉండి లబ్దిదారులతో నిర్మాణాలను పూర్తీ చేయటానికి చర్యలు తీసుకోవాలని,నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేసించేరు.కింది స్థాయి సిబ్బందితో నిరంతరం పర్యవేక్షించాలని,ఇళ్ళ నిర్మాణాలలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,నిర్మాణాలకు అవసరమైన సిమెంట్,ఇసుక లబ్ధిద్దర్లకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని,లేఔట్లలో రహదారులు,విద్యుత్,మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించటానికి చర్యలు చేపట్టాలని మంత్రి పార్ధ సారధి అధికారులకు దిశా నిర్దేశం చేసేరు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల గృహనిర్మాణ శాఖ అధికారులుతో మాట్లాడి ఇల్లనిర్మాణాల పురోగతిని తెలుసుకొని,సత్వరం నిర్మాణాలు పూర్తీ చేయటానికి అవసరమైన చర్యలను మంత్రి సూచించేరు.రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహనిర్మాణాల అమలు జరుగుతున్న తీరును మంత్రికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.ప్రతి రోజు జిల్లా అధికారులుతో సమీక్షలు నిర్వహిస్తూ నిర్మాణాలలో వేగం పెంచుతున్నామని ఆయన మంత్రికి వివరించేరు. ఈ సమావేశంలో గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ వేణుగోపాల్,సుపరెండెంట్ ఇంజినీర్ జయరామాచారి,చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ,ఇతర అధికారులు పాల్గొన్నారు



# తిరంగా యాత్రలో పాల్గొన్న వాణి వెంకట్



**గుంటూరు, కలంకౌంటర్ :** ఆపరేషన్ సింధూర్ లో భాగంగా పాకిస్థాన్ లో ఉగ్రవాద స్థావరంలో మట్టు పెట్టడమే కాకుండా పాకిస్తాన్ కాల్పులను ధీటుగా ఎదుర్కొని ఘన విజయం సాధించిన సందర్భంగా మన దేశ సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర శనివారం ఉదయం గుంటూరులో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షులు త్రిపురమల్లు వాణి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగావాణి వెంకట్ మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరాడే ఏకైక దేశం భారతదేశం ఏకైక నాయకుడు నరేంద్ర మోడీ అని అన్నారు. ఈ కార్యక్రమంలోబిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి తెలుగుదేశం స్టేట్ మహిళ అధ్యక్షురాలు గుడిపల్లి వాణి జనసేన గుంటూరు నగర కార్యదర్శి విజయలక్ష్మి జి నాగమల్లేశ్వరి సువర్ణ తదితరకూటమి మహిళా నాయకులు పాల్గొన్నారు.

# నృసింహుని సేవలో ఎమ్మెల్యే కుటుంబం

● భక్తులకు అందుతున్న సౌకర్యాలపై స్వయంగా పర్యవేక్షించిన ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు,కలంకౌంటర్ :** మాలకొండ శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి జయంతి ఉత్సవాలు సందర్భంగా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలు, నియోజకవర్గం లోని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని కోరుకున్నారు. వేకువజామున దర్శన భాగ్యం అనంతరం భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆయనే స్వయంగా పరిశీలించారు. భక్తుల సౌకర్యాలు ఏర్పాట్ల విషయంలో అధికారులు అశ్రద్ధ వహించవద్దని సూచించారు. సాంప్రదాయిక దుస్తుల్లో భక్తులను పలకరిస్తూ ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక ఆకర్షణగా కనిపించారు. జయంతి ఉత్సవాలు సందర్భంగా చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అల్పాహార శాల వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన పలహారాన్ని చీరాల, కందుకూరు ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు వితరణ చేశారు.

# అన్నప్రసాద భోజనాల పంపిణీ





**కారంపూడి (పల్నాడు జిల్లా),కలంకౌంటర్ :** పట్టణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ వాసవి సేవ అన్నప్రసాద కమిటీ పర్యవేక్షణలో ప్రతి శనివారం 300 మందికి అన్నప్రసాద భోజనాల పంపిణీకి కొత్త సత్యనారాయణ జ్ఞాపకార్థం దాతలుగా కొత్త హనుమాయమ్మ కుమారుడు శ్రీనివాసరావు ధర్మపత్ని రజిని కూతుళ్లు ఆశ్రిత గ్రీష్మ, సత్య సౌమిక వీరి కుటుంబ సభ్యులు కలిసి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ ఫౌండర్ భవిరిశెట్టి రామారావు, వల్లంబొట్ల నరేష్, గుండా నరసింహారావు, సూరేఅరుణ్ కుమార్ ధర్మపత్ని గీత అన్నప్రసాద మహిళా సభ్యులు చిన్ని లక్ష్మి, భవిరిశెట్టి సీతామహాలక్ష్మి, పల్లా పద్మ, కొల్లిపర వెంకట లక్ష్మీ కుమారి, గుండా మహేశ్వరి, యకల రమాదేవి, ఇమ్మడిశెట్టి కోమలి, భాను తేజ పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## -ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు





(మొదటి పేజీ తరువాయి)

పాలవుతున్నారు. ప్రతిరోజూ అందరూ యోగా చేయాలి. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ యోగా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తాం.

**వ్యర్థాల రీ సైక్లింగ్ పై బుద్ధుడి కథను వినిపించిన సీఎం చంద్రబాబు..** వ్యర్థాల రీ సైక్లింగ్ పై బుద్ధిడి కథ మనకు కనువిప్పు కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. బుద్ధుడు, శిష్యుడు మధ్య జరిగిన సంభాషణను ముఖ్యమంత్రి చదివి వినిపించారు. ఓరోజు బుద్ధుని దగ్గరకు వచ్చిన ఓ శిష్యుడు... మీరు ప్రపంచంలోని అందరి గురించి ఆలోచిస్తున్నారు. మీ సొంత శిష్యుల సంక్షేమం మీద కూడా కొంచెం దృష్టిపెడితే బాగుంటుంది కదా?" అన్నాడు. అందుకు ఏం కావాలో కోరుకోమని బుద్ధుడు చెప్పగా... తన బట్టలు పూర్తిగా చిరిగిపోయాయని, కొత్త బట్టలు కావాలని కోరాడు. బుద్ధుడు ఇచ్చిన కొత్త వస్త్రాలను తీసుకుని శిష్యుడు ఇంటికి వెళ్లిపోయాడు . కొద్ది రోజుల తర్వాత... బుద్ధుడుకి తన శిష్యుడికి ఇచ్చిన వస్త్రం గుర్తొచ్చి తానిచ్చిన కొత్త బట్టలు గురించి అడిగాడు. పాత వస్త్రం ఏం చేశావని బుద్ధుడు అడగ్గా అది నా పడక బొంతలో పరుపుగా వాడుతున్నానని శిష్యుడు చెప్పాడు. ఆ పాత పరుపును ఏం చేశావని అడగ్గా ...ఆ పాత బొంతను కిటికీ తెరగా వాడుతున్నా అన్నాడు. మరి పాత తెరను ఏం చేశావనగా....వంటగదిలో వేడి పాత్రలు దించేందుకు మసిగుడ్డగా ఉపయోగిస్తున్నా అని చెప్పాడు. వస్తువులను ఎలా వాడుకోవాలో తెలిసిన శిష్యుణ్ణి మనస్ఫూర్తిగా బుద్ధుడు అభినందించాడు. ఈ ప్రపంచంలో దేన్నీ వృధా చేయకుండా ప్రతి దాన్ని రీ సైకిల్ చేయడం ద్వారా ఉపయోగించుకోవచ్చని చెప్పేందుకే ఈ కథను చెప్పానని సీఎం చంద్రబాబు అన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..** నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నాం. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసి పోయింది. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో చెత్త లేకుండా చేయమని మంత్రి నారాయణకు చెప్పాను. ఇప్పటి వరకూ 55 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగించారు. రోడ్డుపై చిన్న కాగితం ముక్క కూడా వేయకుండా బాధ్యతగా వ్యవహరించే దేశం జపాన్ . మనమూ దీన్ని అలవాటు చేసుకోవాలి. చెత్త నుంచి ఎనర్జీ తీసే ప్రాజెక్టులు ప్రస్తుతం రెండు పనిచేస్తున్నాయి. భవిష్యత్ లో రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కడపలో అందుబాటులోకి వస్తాయి. వీటి వల్ల 90 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండే చెత్త ఎనర్జీగా తయారవుతుంది. నేను తెచ్చిన డ్వాక్రా సంఘాలు బాగా పనిచేస్తున్నాయి. ఓర్వకల్లు డ్వాక్రా సంఘాలు కోవా బాగా తయారుచేస్తున్నారు. కోటిమందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళలు గ్రామాల్లో ప్రజా చైతన్యం తేవాలి. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నుంచి కంపోస్ట్ తయారీకి కేంద్రాలు ఏర్పాటు చేశాం. చెత్తను సేకరించి దాన్ని కంపోస్ట్ గా తయారుచేసి రైతులకు ఎరువుగా ఇవ్వాల్సిన బాధ్యత డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తున్నాం. పొడి చెత్తను పరిశ్రమలకు పంపి రీ సైక్లింగ్ చేయిస్తాం. పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులు శుభ్రం చేయబోతున్నాం. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్స్ వేస్తాము. 123 మున్సిపాలిటీ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లు పెట్టాం. అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఓడీఎఫ్ ప్లస్ గా నిలిచాయి. 15, 995 గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్ గా చేయాలని నిర్ణయించాం. 2026 మార్చి నాటికి వందశాతం ఓడీఎఫ్ ప్లస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

**మరిన్ని రైతు బజార్లు అందుబాటులోకి తెస్తాం..** రైతులకు గిట్టుబాటు ధర రావాలి, వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందాలనే లక్ష్యంతో 1998లో నేను రైతు బజార్ లు ప్రారంభించాను. పల్లె వెలుగు పేరుతో ఆర్టీసీ బస్సులు ప్రారంభించాం. బస్సు వెనుక సీట్లు ఖాళీ చేయించి అందులో కూరగాయలు వేసి రైతు బజార్లకు రైతులు తరలించేలా ఏర్పాట్లు చేశాం. దీనివల్ల దళారీ బెడద తగ్గించాం. రూ.6 కోట్లు కేటాయించి కర్నూలులోని రైతుబజార్ ని ఆధునికీకరిస్తాం. ప్రస్తుతమున్న 125 రైతు బజార్ల సంఖ్యను పెంచుతాం. ఒకప్పుడు మొబైల్ రైతు బజార్లు కూడా విజయవంతంగా నడిపించాం.

**రాయలసీమలో కరువు మాట వినబడదు..** నేను సీమ బిడ్డను సీమ అభివృద్ధి నా బాధ్యత. ఒకప్పుడు రాయలసీమ అంటే కరువు, ఫ్యాక్షన్ అనేవారు. నేను వచ్చాక సీమలో ఫ్యాక్షనిజం మాటే వినబడకుండా చేశాను. కరువు రక్కసి నుంచి సీమ ప్రజలను కాపాడాము. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తాం. ప్రస్తుతం సీమలో 18 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ ఉంది. రాబోయే ఐదేళ్లలో 36 లక్షల హెక్టార్లలో హార్టికల్చర్ పెడతాం. 16 లక్షల ఎకరాలకు డ్రిప్ ఇరిగేషన్ ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లు వారు పట్టించుకోలేదు. మైక్రో ఇరిగేషన్ కింద ప్రతి రైతుకు 10 ఎకరాల వరకూ 90 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. సీమ నాలుగు జిల్లాలకూ నాలుగు ఎయిర్ పోర్టులు (తిరుపతి, కడప, పుట్టపర్తి, ఓర్వకల్లు) ఉన్నాయి. టీడీపీ చొరవతో ఈ జిల్లాలకు జాతీయ రహదారులు అనుసంధానమయ్యాయి. రాబోయే రోజుల్లో సీమ గ్రీన్ ఎనర్జీకి హబ్ గా తయారవుతుంది. సోలార్ ఇక్కడి నుంచే ఉత్పత్తవుతుంది. విండ్ ఎనర్జీ ఇక్కడి నుంచే వస్తుంది. దేశంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి సీమ కేంద్రంగా పనిచేస్తుంది. ఓర్వకల్లు, కొప్పర్తి లో రూ. 5 వేల కోట్ల ఖర్చుతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ వస్తుంది. పోలవరం-బనకచర్ల పూర్తయితే రాయలసీమకు గేమ్ చేంజర్ అవుతుంది. లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకు అనేక పరిశ్రమలు తెస్తున్నాం.

**ఓవైపు సంక్షేమం -మరోవైపు పెట్టుబడులు..** ఎన్డీఏ ప్రజా ప్రభుత్వం. అర్హులకు సంక్షేమం అందిస్తూనే రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తెస్తున్నాము. ఇప్పటికే 76 ప్రాజెక్టులు తెచ్చాం. రూ.4.96 లక్షల పెట్టుబడులు వస్తున్నాయి. తద్వారా రాష్ట్రంలో 4.51 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయి. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాము. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 4 వేలు మొదలు రూ. 15 వేల వరకూ పింఛను అందిస్తున్నాము. అన్న క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాము. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాము. స్కూళ్లు తెరిచేలోగా డీఎస్సీ ద్వారా టీచరు పోస్టులు భర్తీ చేస్తాం. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం కింద రూ. 15 వేలు జమ చేస్తాం. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం. సోలార్ వెలుగులు తెస్తాం. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఇంటిపై కరెంటు తయారీ సౌకర్యం కల్పిస్తాం. అందరం కలిసి పేదలకు అండగా ఉందాం. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా రూపుదిద్దుకుందాం. అవసరమైన సంక్షేమ పథకాలన్నీ అందజేస్తాం. ఆదాయాన్ని పెంచే మార్గం చూపిస్తాం. పేదల జీవితాల్లో వెలుగు తేవడానికి పని చేస్తా. నేను పడే కష్టం నా కోసం, ధనవంతుల కోసం కాదు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉండే నిర్భాగ్యులు తృప్తిగా ఉండాలని ఆలోచిస్తున్నాను. పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చిన పారిశ్రామిక వేత్తలను అభినందిస్తున్నాను.

**పాణ్యంలో పలు అభివృద్ధి పనులు..** రూ. 50 లక్షలతో ఉద్యానవన అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అలాగే పాణ్యం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ. 50 కోట్లు విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో ఇంటింటికీ సురక్షిత నీరు అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి - కమిషనర్ ఎన్.మౌర్య






**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. మూడవ శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ధ హీట్ నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతలను తగ్గించేలా మొక్కలు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు, పశు పక్ష్యాదుల కొరకు నీటి తొట్టెల ఏర్పాటు, పారిశుధ్య కార్మికులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, టోపీలను అందజేశారు. ప్రజలు, ఉద్యోగులు అందరూ వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర లో భాగంగా నాలుగు నెలల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా ఈ నెల బీట్ ధ హీట్ నినాదంతో ఎండ వేడిమి నుండి ఉపశమనం కలిగేలా పాల కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. వేడి పెరగకుండా మొక్కలు నాటడం, రూఫ్ టాప్ గార్డెనింగ్ తదితర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని అన్నారు. నగరంలో ఎండ వేడిమి నుండి రక్షణ పొందేలా మరిన్ని కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నామని అన్నారు. శాప్ చైర్మన్ రవి నాయుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ మునికృష్ణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బ తినకుండా మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు అన్నా అనిత, రేవతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్ విజయవంతం నేపథ్యంలో పెడనలో తిరంగా ర్యాలీ

**పెడన,కలంకౌంటర్ :** దేశ గౌరవం బలం బలగం సాయుధ బలగాలే అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా కేంద్రప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు పెడనలో శనివారం తిరంగా ర్యాలీని నిర్వహించారు. పెడన మున్సిపల్ కార్యాలయం నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకూ సాగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు పెడన జనసేన పార్టీ సమన్వయ కర్త పంచకర్ల సురేష్ నాలుగు మండలాల కన్వీనర్లు డీసీ చైర్మన్లు పోతన లక్ష్మీ నరసింహ స్వామి బొర్రా కాశీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉగ్రవాదులు ఈ దేశంపై కన్నెత్తి చూడకుండా రక్షణ దళాలు పోరాడాయని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు..ఉగ్రవాదంపై సైనిక దళాలు పోరాటం చేస్తున్నాయంటూ సెల్యూట్ చేశారు. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో దేశాన్ని జవాన్లు కాపాడుతున్నారని చెప్పారు. పహల్గాం ఘటన గుర్తుకురాగానే అందరిలో పౌరుషం, ఉద్వేగం వస్తుందన్నారు. రక్షణలోనే కాదని, ఆర్థిక శక్తిగానూ దేశం ఎదుగుతోందన్నారు. దేశభద్రత, సమగ్రత కోసం మనమంతా ఏకతాటిపై నడవాలని కోరారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీనాయక్ స్ఫూర్తితో ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మన ప్రాంతం వారే కావడం అందరికీ గర్వకారణమని తెలిపారు. మన సైనికులను చూసి రాష్ట్రమే కాదు దేశమంతా గర్విస్తోందని మనం అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

# ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం: సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి



**కర్నూలు,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని మహిళలందరికీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుయం కల్పిస్తామని ఏపి సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కర్నూలులో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఉద్యోగులు కూడా ప్రతినెలా మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు.

**అన్ని నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేస్తాం..** 'రైతుబజార్లను 1999లో నేనే ఏర్పాటు చేశాను. రైతులకు గిట్టుబాటుధర రావాలి.. వినియోగదారులకు తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తులు అందజేయాలనే ఒక మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేశాం. మేం తెచ్చిన రైతు బజార్ల వల్ల రైతులు లబ్ధి పొందారు, వినియోగదారులకు కూడా ఎంతో మేలు జరిగింది. కర్నూలు సి క్యాంప్ రైతు బజారును రూ.6 కోట్లతో ఆదర్శ రైతుబజారుగా అభివృద్ధి చేస్తాం. పక్కనే ఉన్న స్థలంలో అండర్ గ్రౌండ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తాం. రాష్ట్రంలో ఇప్పటి వరకు 125 రైతు బజారులు ఉన్నాయి. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రైతు బజార్లకు సేంద్రియసాగులో పండించిన కూరగాయలు వచ్చేలా చూస్తాం.

**ప్రపంచం గర్వించేలా యోగా డే నిర్వహిస్తాం..** ప్రపంచం గర్వించేలా విశాఖలో యోగా డే నిర్వహిస్తాం ప్రధాని మోదీ కూడా వస్తున్నారు. యోగా దేను నెలరోజులపాటు నిర్వహిస్తాం. ప్రజలకు శిక్షణ ఇస్తాం. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంట యోగా చేయాలని కోరుతున్నా. ఆఫ్లైన్, ఆన్‌లైన్‌లో యోగా శిక్షణ ఇస్తాం. నెట్ జీరో వేస్ట్ కోసం ప్రజలంతా ఆలోచించాలి. ప్రపంచంలో ఏ వస్తువూ వృథా కాదు.. అన్నీ ఏదో ఒక రూపంలో ఉపయోగపడతాయి. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేయాలి. అక్టోబరు 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూడాలని ఆదేశించా. చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నాం.. రెండు ప్రాజెక్టులు పనిచేస్తున్నాయి. రాజమహేంద్రవరం, విజయవాడ, నెల్లూరు, కడపలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం. డ్వాక్రా, మెప్మా మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారుతున్నారు. గ్రామాల్లో చెత్తను ఎరువుగా మార్చే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. చెత్తను వేరు చేసి రీసైక్లింగ్‌కు పంపిస్తే.. వాటిని మళ్లీ వాడతారు. జపాన్‌లో ఎక్కడా రోడ్ల మీద కాగితం కనిపించదు.. అదీ సామాజిక బాధ్యత. ఆ దేశంలో రోడ్డుపై పేపర్ కనిపిస్తే ఇంటికి తీసుకెళ్లి చెత్తబుట్టలో వేస్తారు. మన రాష్ట్రంలో కూడా ప్రజల్లో చైతన్యం రావాలి" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర మంత్రులు నారాయణ, ఎన్ఎండీ ఫరూఖ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, జిల్లా కలెక్టర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసులు - జిల్లా ఎస్పీ తుషార్ డూడి








**బాపట్ల,కలంకౌంటర్ :** భావితరాల ఆరోగ్యకరమైన వాతావరణమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లు, కార్యాలయాలలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం జిల్లా పోలీసులు నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. గుణపం, పారలు, చీపురులు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలలో 3వ శనివారం నిర్వహించబడుతుందన్నారు. స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత మాత్రమే కాదు %-% అది మన అభివృద్ధికి పునాదని, శుభ్రమైన పరిసరాలు మన ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. పోలీస్ స్టేషన్/కార్యాలయాల పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. పరిశుభ్రమైన పర్యావరణం మానసిక ప్రశాంతతను పెంచుతుందన్నారు. ఇది పోలీస్ సిబ్బంది పనితీరుపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుతం వేసవి కాలం కనుక సహజమైన చల్లదనం కోసం టెర్రస్ లపై ఆకర్షణీయమైన, ఆరోగ్యకరమైన మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పక్షుల దాహార్తి తీర్చేందుకు గోడలు, టెర్రస్ లపై చిన్న మట్టి పాత్రలలో పక్షులు తాగేవిధంగా నీటిని ఏర్పాటు చెయ్యాలన్నారు. భూమిపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాలు పడేందుకు చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మనం ఇప్పుడు నాటే చెట్లు భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఇస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా భావించి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఎఆర్ డిఎస్పీ పి.విజయసారధి, ఎస్బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఆర్.ఐ మౌలుద్దీన్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తుడా టవర్స్ నిర్మాణ పనులు పరిశీలించిన ఉపాధ్యక్షులు ఎన్ మౌర్య





**తిరుపతి,కలంకౌంటర్ :** తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య కూడలి వద్ద నిర్మిస్తున్న తుడ టవర్స్ నిర్మాణ పనులను శనివారం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తుడ టవర్స్ నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయని, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. ప్లాన్ ప్రకారం పనులు చేయాలని, ఆదిశగా అధికారులు అందరూ నిత్యం పనుల పర్యవేక్షణ చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణా రెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

- భూ భారతి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం
- పట్టాదారు పాసు పుస్తకంలో భూకమతాల మ్యాపుల ముద్రణ
- రైతులు నచ్చిన, మెచ్చిన చట్టం భూ భారతి రెవిన్యూ చట్టం



**కొండాపూర్,కలంకౌంటర్ :** కొండాపూర్ మండల కేంద్రం లో భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ పై రెవెన్యూ సదస్సులో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు వెల్లడి. ఈ సందర్భంగా మంత్రి లిమంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ తెలంగాణ అంటేనే భూ పోరాటాల చరిత్ర అన్నారు. దున్నేవాడిదే భూమి అనే పదాన్ని చాలా సంవత్సరాలుగా వింటూనే ఉన్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నూతన చట్టాన్ని తీసుకొచ్చి పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేసిందన్నారు. గత ప్రభుత్వం ధరణి తీసుకొచ్చి రైతులను గోస పెట్టిందని అన్నారు. చాలా సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయని భావిస్తున్నాన్నారు. ధరణి పోర్టల్ ఉన్న ఇబ్బందులను సరి చేసే విధంగా కొత్త భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 18 రాష్ట్రాల్లో ఉన్న రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి అందులో ఉన్న ముఖ్యమైన అంశాలను తీసుకుని వేలాదిమంది అభిప్రాయాలను తీసుకొని మీరు నచ్చిన మెచ్చిన చట్టమే భూభారతి చట్టం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.. ఆనాడు ధరణి చట్టాన్ని తీసుకొచ్చారు కానీ సమస్యలు వస్తే దాన్ని పరిష్కరించే మార్గం చూపలేదన్నారు. దానికి కారణంగా భూములున్న ఆసాములు ఇబ్బంది పడ్డారని తెలిపారు. రైతుల భూ సమస్యలు గుర్తించే ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. మనిషికి ఆధార్ ఎలా ఉంటుందో అదే విధంగా భూదాన్ ను ఈ చట్టంలో పెట్టడం జరిగిందన్నారు. ఎక్కువగా భూములకు బౌండరీ లేకపోవడం మ్యాప్ లేకపోవడం వల్ల భూ సమస్యలు తలెత్తాయన్నారు. భూభారతి చట్టంలో సర్వే చేసి మ్యాపులు ఇచ్చి పాస్ బుక్ లో అప్లోడ్ చేస్తే శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సర్వే నంబర్ కి గాని ఆ ఖాతాకి గాని భవిష్యత్తులో ఎప్పుడు ఇబ్బందులు రావని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్ టైం లోనే భూములకు సర్వే మ్యాప్ రిజిస్ట్రేషన్ తో పాటు మీ పాస్ బుక్ లో కానీ మీ డాక్యుమెంట్ లో కానీ అప్లోడ్ చేసే కార్యక్రమాన్ని ఈ చట్టంలో ప్రవేశపెట్టనున్న అని తెలిపారు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. భూభారతి చట్టంలో రైతులకు డాక్యుమెంట్ సాఫ్ట్ కాపీ తో పాటు హార్డ్ కాటు కూడా అందించి జమాబంది కార్యక్రమాన్ని కచ్చితంగా ఏర్పాటు చేస్తామన్నారు. భూభారతి కోసం నాలుగు పైలెట్ మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ మండలాల్లో వచ్చిన దరఖాస్తుల్లో సాదా బైనామ కాకుండా మిగతా అంశాలన్నిటిని జూన్ రెండు నాడు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఫారెస్టు రెవెన్యూ దేవాలయాలకు సంబంధించిన కొన్ని భూతాగాదాలున్న మాట వాస్తవమని భూ సమస్యలు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ ప్రత్యక్షంగా సర్వే చేసి శాశ్వతంగా ఆ భూ సమస్యలకు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజ్ కు సూచన చేశారు. ధరణిలో ఏ సమస్య వచ్చినా సివిల్ కోర్టుకు పోవాల్సి వచ్చేదని కానీ భూభారతిలో ఎమ్మార్వో ఆర్డీవో అడిషనల్ కలెక్టర్ సీసీఎల్ ఏ స్థాయిలో తప్పు జరిగితే ఆ స్థాయిలో అప్పీల్కు వెళ్లే అవకాశం ఈ చట్టంలో వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు అంతే కాకుండా ప్రత్యేకంగా ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఎమ్మార్వో స్థాయి అధికారులతో వారి టీం మీ గ్రామానికి వస్తుందని భూభారతికి చట్టానికి సంబంధించి రెండు రోజుల ముందే మీకు దరఖాస్తు ఫారాలు ఇస్తారని మీ సమస్యలు ఇచ్చేసి అధికారులకు ఇస్తే మీ సమస్యను మీ గ్రామంలోని పరిష్కరించే విధంగా చూడడం జరుగుతుందన్నారు. రైతులెవరు భూభారతి చట్టం గురించి అభద్రతకు గురికా వద్దన్నారు మీరు నచ్చిన మెచ్చిన చట్టమే భూభారతి చట్టం అన్నారు. పేదవాడికి మంచి కలిగించే ఉద్దేశం కొద్దీ ఈ చట్టాన్ని సవరించే అవకాశం కూడా కల్పించడం జరిగింది అన్నారు. భూభారతి చట్టాన్ని అమలు చేసే దాంట్లో అధికారులు నిర్లక్ష్యం వహించిన స్వార్థపూరితమైన ఆలోచనతో ఎవరైనా రైతులను ఇబ్బంది పెట్టినట్లు తెలిస్తే ఈ చట్టంలో ప్రొహిబిషన్ ఏర్పాటు చేశామని అలాంటి అధికారుల మీద కఠిన చర్యలు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉంటాయని మంత్రి అధికారులను హెచ్చరించారు. అధికారులు మానవతా దృక్పథంతో ఉండాలని సూచించారు. ఇందులో ఏ రాజకీయ పార్టీ ముఖ్యం కాదు అన్నారు. రాష్ట్రంలో 32 మండలాలు భూభారతి చట్టం తీసుకొచ్చామని జూన్ రెండు నాడు దాని ఫలితాలు ప్రజలకు అందుతాయన్నారు. ఆగస్టు 15 నాటికి భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలన్నిటినీ పరిష్కరించాలన్నది ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు.. ఈరోజు సాయంత్రం వరకు రాష్ట్రంలో సుమారు 6000 మంది లైసెన్స్ సర్వేయర్లను భూభారతి చట్టం కోసం నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జూన్ రెండో తారీఖు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ట్రైని సర్వేయర్లని నియమిస్తామని మంత్రి స్పష్టం చేశారు.. ప్రతి మండలము యూనిట్ చేసి సర్వేలను ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా చూస్తామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం తరపున 256 మంది సర్వేయర్లు ఉన్నారని మరో వెయ్యి మంది సర్వేయర్లు ఉండే విధంగా కార్యక్రమం చేపడతామన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా 10,956 వీఆర్వో వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని గుర్తు చేశారు దాని వలన గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల ప్రాంతాల్లో నివసించే భూములు ఉన్న రైతులు రెవెన్యూ అధికారులు ఇబ్బంది గురయ్యారు అన్నారు. ప్రజల కోరిక మేరకు జూన్ రెండో తారీఖున 10,956 రెవెన్యూ అధికారులను నియమించడం జరుగుతుందన్నారు. పేదవాళ్లలో అత్యంత పేదవారికి ఇల్లు నిర్మించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్రంలో మొదటి విడతగా నాలుగున్నర లక్షల ఇండ్లు ఇస్తున్నామని అందులో భాగంగా నియోజకవర్గానికి 3500 చొప్పున ఇల్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టి వివిధ స్థాయిలో ఆగిపోయిన వాటిని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఆ శాఖ మంత్రిగా చెబుతున్నానని ఆయనస్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో ఎంపి సురేష్ శెట్కార్, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి , టీ జి ఐ ఐ సి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ ఎంఎ ఫహీం లు పాల్గొన్నారు.

# శ్రీ వేణుగోపాలస్వామికి అష్టబంధన ప్రయోగం

- భక్తులకు అష్టబంధన నియమ నిబంధనలు ఉపదేశించిన వేద పాఠశాల ఆచార్యులు శ్రీనివాస దీక్షితులు
- భాగవతం విశిష్టతను వివరించి టీటీడీ వేద పండితులు సుదర్శనం సీతారామాచార్యులు



**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** విజయవాడ రూరల్ మండలం నున్నలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక కార్యక్రమాలలో భాగంగా మూడో రోజైన శనివారం శ్రీ వేణుగోపాలస్వామి వార్లకు అష్టబంధన ప్రయోగం జరిగింది. తొలుత విష్వక్సేన పూజతో కార్యక్రమాలను పునరుద్ధరించగా, పుణ్యాహవచనం, కుంభారాధన, అష్టబంధన ద్రవ్య ఆరాధన క్రతువుల అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మగిరి వేద పాఠశాల ఆచార్యులు, వైఖానస ఆగమ రత్న స్పురత్ రత్న శ్రీమాన్ మాల్యవంతం శ్రీనివాస దీక్షతులు, వేద పండితులు సుదర్శనం సీతారామాచార్యులు సమక్షంలో వేణుగోపాలస్వామికి అష్టబంధన ప్రయోగం జరిగింది. తొలుత దేవస్థానం ప్రధానార్చకులు రొంపిచర్ల అప్పలాచార్యులు (గోపాలం), రొంపిచర్ల శేషాచార్యులు, అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యంలో రుత్వికుల బృందం పలు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ తిరుమల గిరి వేదపాఠశాల ఆచార్యులు శ్రీనివాస దీక్షితులు అష్టబంధనం, అందుకు సంబంధించిన నియమ నిబంధనలను భక్తులకు ఉపదేశించారు. అలాగే టీటీడీ వేద పండితులు సుదర్శనం సీతారామాచార్యులు భాగవతం, దాని విశిష్టతను భక్తులకు ఉపదేశించారు

# ఆపరేషన్ సింధూర్ కు సెల్యూట్!

## - 120 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ






**కందుకూరు,కలంకౌంటర్ :** ఉగ్రవాదాన్ని అంతం చేయడం లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించిందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా కందుకూరు పట్టణంలో శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం నుండి ర్యాలీగా అంకమ్మ గుడి, పోస్ట్ ఆఫీస్ సెంటర్, అంబేద్కర్ కూడలి మీదగా ఆర్టీవో ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగింది. బోలో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో దేశభక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ తిరంగా ర్యాలీ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశం ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్లకు శ్రద్ధాంజలి అర్పించి దేశభక్తిని పెంపొందించటమని ఎమ్మెల్యే తెలిపారు. .అనంతరం ఆర్డిఓ ఆఫీస్ వద్ద అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ కు అశ్రునివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు పిటికిటి వెంకటేశ్వర్లు కందుకూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాద్, జొన్నాదుల రాఘవయ్య, ఉన్నం భాస్కరరావు, జనసేన నాయకులు మదన్, హరిని ప్రజా వైద్యశాల డాక్టర్ మల్లికార్జున, టిడిపి నాయకులు చదలవాడ కొండయ్య, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, ఉన్నం వీరాస్వామి, షేక్ రూబీ, షేక్ సలాం, కొత్తూరు వెంకట సుధాకర్, డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, మురారి శెట్టి సుధీర్, కోటా కిషోర్ బాబు, కాకుమాని ప్రవీణ్, కల్లూరి శైలజ, ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు, బిఆర్ ఆక్స్ఫర్డ్ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# శత్రు దేశానికి వెన్నులో వణుకు పుట్టింది

- భారత సైనికుల సామర్థ్యం ప్రపంచ దేశాలకు మరోసారి గుర్తు చేశారు
- వీర జవాన్ల పోరాట స్ఫూర్తి కి దేశం గర్విస్తోంది
- తిరంగా భారీ ర్యాలీలో తుడా నూతన చైర్మన్ డాక్టర్ సి దివాకర్ రెడ్డి






**శ్రీకాళహస్తి,కలంకౌంటర్ :** అమాయక ప్రజలను విచక్షణ రహితంగా కాల్చి చంపిన ఉగ్ర మూకులకు స్థావరం ఇస్తున్న శత్రు దేశానికి భారత్ దీటుగా సమాధానం చెప్పిందని తుడా నూతన చైర్మన్ డాక్టర్ సి దివాకర్ రెడ్డి కొనియాడారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణంలో జరిగిన తిరంగా భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు . అనంతరం ఆయన మాట్లాడుతూ శత్రుదేశానికి వెన్నులో వణుకు పుట్టే విధంగా ఆపరేషన్ సింధూర్ తో ఉగ్ర మూకల స్థావరాలను భారత్ సైన్యం నేలమట్టం చేసిందన్నారు. మరో మారు భారత్ వైపు చూడకుండా శత్రు దేశాలకు తన సత్తాను చాటి చెప్పడంతో భారత పౌరులు గర్విస్తున్నారన్నారు. వీర సైనికుల పోరాటపటిమను చూసి ప్రతి భారత పౌరుడు నేడు గర్విస్తున్నాడని చెప్పారు. దేశ ప్రధాని మోడీ పాలనను ప్రజలు కీర్తిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. తిరంగా భారీ ర్యాలీలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కోలా ఆనంద్, సామంచిశ్రీనివాస్, కూటమి నేతలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కొండపల్లి బొమ్మల ఖ్యాతిని చాటిచెప్పేలా ఎక్స్పీరియన్స్ సెంటర్..

- పర్యాటకులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు..
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,కలంకౌంటర్ :** దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న బావితరాల కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పేలా ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలో శనివారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యాటక మున్సిపల్ శాఖల అధికారులతో ఎక్స్పీరియన్స్ సెంటర్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. పర్యాటకంగా జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలకు కూడా రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్పీరియన్స్ సెంటర్ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఎక్స్పీరియన్స్ సెంటర్లో కొండపల్లి బొమ్మల విశిష్టతను తెలిపేలా అందమైన పెయింటింగ్స్తో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలన్నారు. భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణతో ఆకర్షణీయంగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే రూపొందించిన డిజైన్ ఆధారంగా ఎక్స్పీరియన్స్ సెంటర్ పనులు వేగవంతం చేయాలన్నారు. నగర పంచాయతీ అధికారులు పరిశరాలను పరిశుభ్ర పరచి శానిటేషన్ను మెరుగు పరచాలన్నారు. కొండపల్లి ఖిల్లాను పర్యటించే పర్యాటకులకు కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్ సెంటర్ పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుండి ఖిల్లా వరకు పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించుకునేలా చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి త్వరితగతిన వినియోగంలోనికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏపి టూరిజం ఆథారిటీ ఛీఫ్ మార్కెంటింగ్ ఆఫీసర్ ఎస్. పద్మారాణి, టూరిజం కన్సల్టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ. శిల్ప, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన, తదితరులు ఉన్నారు.

# ప్రజలలో పచ్చదనం పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలి

- ఘనంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్వహణ.
- నరసింహులు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి.




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ప్రతినెలా మూడవ శనివారం ప్రభుత్వపరంగా నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ పశువుల ఆసుపత్రి రైతు బజార్ ప్రాంతాలలో అవగాహన కల్పించేలా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, ఎన్. సి. హెచ్. నరసింహులు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శుభ్రతా ఉద్యమం అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. చెట్లను పెంచి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పి. వి. ఫణి కుమార్ సహకారంతో పశువుల ఆసుపత్రిలోని పశువులకు తొట్టెలు నిర్మించి పశువుల దాహార్తిని తీర్చే విధంగా ఆ తొట్టెలలో నీరు నింపడం జరుగుతోందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్పొరేషన్ 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, పశువుల ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్, ఎస్. నాగభూషణం, 45వ డివిజన్ సచివాలయ అడ్మిన్, షేక్ అల్లాబక్షు, ఎం. మానస, రామశేఖర్, సచివాలయ సిబ్బంది, టి. రమాదేవి, ఏ రామాంజనేయులు, పశువుల ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర జీవనాడి లాంటిది.

### కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ.

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర, ప్రతి గ్రామానికి జీవనాడి లాంటిదని కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ అన్నారు. పెద కానూరు లోని పాటిమీద ఉన్న అంగన్వాడీ స్కూల్ నందు గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గోపు గ్రామ ప్రజలు ,ఉద్యోగు లతో స్వర్ణ ఆంధ్రా – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సంకల్పానికి ప్రజలందరు కట్టుబడి ఉండాలని, చెత్తను డస్టబిన్ లో వేయాలని,ప్లాస్టిక్ వాడకం నిషేదించాలన్నారు. పంచాయితీ సెక్రెటరీ వెంకటేశ్వరరావు , రాము,బొమ్మిడి ఏడుకొండలు ,గోపు వెంకటరమణ, నాని , బొమ్మిడి కొండలరావు , చిన్నా, బోట్ల సాయి,ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ , బుక్ కీపర్లు, ఆశ వర్కర్స్ , అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం ఉదయపు నడక మిత్రమండలి ,మహిళ విభాగం ఆధ్వర్యంలో 16వ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించిన భవనాసి లక్ష్మి లావణ్య . ఈ కార్యక్రమం లో జోన్ చైర్మన్ కారుమూరి రాజేంద్రప్రసాద్ ,అధ్యక్షులు జల్లు మురళి నాథ్ ,ట్రెజరర్ వేద లక్ష్మీనరసింహం ,మాటూరి రామ్మోహన్ ,కొండూరి భద్రం బాబు తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ




**తిరువూరు,కలంకౌంటర్ :** తిరువూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.




# వర్ల కుమార్ రాజా తో బండి రామకృష్ణ భేటీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ను వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసిన మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ. అనంతరం ఇరువురు నాయకులు ఏకాంతంగా రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించారు రైతులకు సేవ చేసే అవకాశం కూటమి ప్రభుత్వంలో రామకృష్ణకు రావడం పట్ల వర్ల కుమార్ రాజా అభినందనలు తెలిపారని తన సహకారం ఎప్పుడూ ఉంటుందని రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని వర్ల రాజా తెలిపారని బండి రామకృష్ణ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పామర్రు జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు నాయకులు కొండ మేస్త్రి, కోటి, మైఖేల్, కోన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# మాల కొండకు పోటెత్తిన భక్తులు

- భారీగా స్వామి వారి ఆదాయం రూ 18,23,562/-లు
- వైభవంగా స్వామి వారి జయంతి ఉత్సవాలు





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరి నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి సందర్భంగా స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి భారీగా ఆదాయం రూ 18,23,562/-లు వచ్చాయని ఆలయ ఈవో సాగర్ బాబు తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. శుక్రవారం కొండ కింద స్వామివారి కళ్యాణం గ్రామోత్సవం ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. శనివారం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి క్యూలైన్లో బారులు తీరారు. భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దగ్గరుండి ఆలయ ఈ వో ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసింహ స్వామి మాల ధారణ భక్తులు స్వామివారికి తమ ఇరుముదులను భక్తిశ్రద్ధలతో చెల్లించుకున్నారు. భక్తులు పొంగళ్ళు లో పెట్టుకుని తమ మె-ుక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ తమిళనాడు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది దాతలు భక్తులకు మంచినీళ్లు ఏర్పాటు చేశారు. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం తమ సిబ్బందితో ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుడ్లూరు సీఐ మంగారావు, కందుకూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, గుడ్లూరు కావలి నెల్లూరు ప్రాంతాల నుండి వచ్చిన పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# భగవద్గీత పోటీల్లో ప్రశంసా పత్రం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం కు చెందిన ఘంటసాల మహాలక్ష్మి కుమారి,ఘంటసాల ఉమాదేవి లకు ప్రపంచ స్థాయి భగవద్గీత పోటీల్లో చూపిన ప్రతిభకు ప్రశంసా పత్రం పొందారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

# నృసింహుడు కలిపాడు

### -గుడిలో అందరం ఒకటే రాజకీయ బరిలోనే ప్రత్యర్థులం



**కందుకూరు,కలంకౌంటర్ :** గుడిలో రాజకీయాలు లేవు అంతా ఒకటేనని నిరూపించిన ఎమ్మెల్యే ఇంటూరినాగేశ్వరరావు,వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్. వివరాల్లోకి వెళితే కందుకూరు నియోజకవర్గం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి జయంతి ఉత్సవంలో భాగంగా శనివారం వేకువ జాము నుంచి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్వామివారి సేవలో ఉన్నారు. స్వామివారి దర్శనానికి కందుకూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, బుర్రా మధుసూదన్ యాదవ్ వారిరువురూ ఒకరికొకరు ఎదురు పడిన తరుణంలో కరచాలనం చేసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. అక్కడ ఉన్నవారు ఈ సన్నివేశాన్ని ఆసక్తిగా తిలకించారు. అదే స్వామివారి లీల అని, స్వామి వారి దగ్గర రాజకీయాలు ఉండవనే దానికి నిదర్శనం అని భక్తులు అనుకున్నారు.

# మజ్జిగ పంపిణీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు

# డా. కొల్లూరి కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డు కు ఎంపిక !



**పెడన(కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు అఖిలభారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కు మరొక అరుదైన గౌరవం లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వె-ుమోరియల్ జాతీయ అవార్డుకు డా. కొల్లూరి ఎంపికయ్యారు. నటరత్న డా నందమూరి తారకరామారావు 102వ జయంతి, దర్శకరత్న దాసరి నారాయణరావు 78వ జయంతిని పురస్కరించుకొని విశాఖపట్నం కి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖరత్న కళాపరిషత్ వారు మంగళవారం విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించిన నిర్వాహకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య మెమోరియల్ జాతీయ అవార్డును సేవా రంగంలో డా. కొల్లూరికి అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవ ప్రతినిధులు తో పాటు పట్టణ పుర ప్రముఖులతోపాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పలువురు డా. కొల్లూరికి అభినందనలు తెలియజేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com